

# ఈ అభ్యర్థి.. ఏ పార్టీ?

02


గందరగోళంలో కార్పోరేషన్, మున్సిపల్ ఎన్నికలు

ఓటర్లకే కాదు.. అభ్యర్థులకు అర్థం కాని పోటీ సమీకరణాలు

# సర్వేనా.. స్క్రీన్‌ప్లేనా..?

- సర్వే పేరుతో గెలుపు గుర్రాలకు పక్కన పెట్టిన పార్టీ
- కష్టపడిన ఆశావహులకు నిరాశ..
- 'డమ్మీ సీట్లు'గా మారిన కేటాయింపులు
- నేతల స్వార్థ లెక్కలే అభ్యర్థుల భవితవ్యాన్ని తేల్చాయా..?
- కొందరు నేతలు తమకు అనుకూలంగా మార్చుకున్న సర్వే ..
- ఆశవహులను మభ్య పెడుతూ.. స్వంత ప్రయోజనాలు

02




జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం 4-2-2026






02

# మిగిలింది వీళ్లే..

| | |
|---|---|
| కొత్తగూడెం 354 | అశ్వారావుపేట 78 |
| ఇల్లందు 108 | |

## నామినేషన్ల ఉపసంహరణ పూర్తి

## కొత్తగూడెం కార్పొరేషన్‌తో పాటు అశ్వరావుపేట, ఇల్లందులో తేలిన తుది బరి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 3, ప్రజాజ్యోతి :

"జిల్లాలో జరుగుతున్న కార్పొరేషన్, మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ పూర్తయ్యింది. మంగళవారంతో ఉపసంహరణ ప్రక్రియ ముగియడంతో కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు అశ్వారావుపేట , ఇల్లందు మున్సిపాలిటీల్లో పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాలను ఎన్నికల అధికారులు ప్రకటించారు. దీంతో ఇక ఎవరు బరిలో ఉన్నారు అన్నది స్పష్టమైంది. దీంతో ఎన్నికల పోరు ఇప్పుడు పూర్తిగా ప్రచార దశలోకి ప్రవేశించింది"

# సర్వేనా.. స్క్రీన్‌ప్లేనా..?

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 3, ప్రజాజ్యోతి :**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జరుగుతున్న కార్పొరేషన్ , మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సీట్ల కేటాయింపు ఇప్పుడు జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. ఓ వైపు సర్వే అంటూ కాంగ్రెస్ అధిష్టానం స్క్రీన్‌ప్లే నడపగా.. మరో వైపు సీట్లు ఇప్పిస్తామంటూ స్థానికంగా ఉన్న సీనియర్ పార్టీ నేతలు కొందరు మరో రకమైన స్క్రీన్‌ప్లే ను నడిపించారు. దీంతో ఎంతోకాలంగా పార్టీని నమ్ముకున్న వాళ్ళు విలాసవంతమైన వేటుకు గురయ్యారు. వాస్తవానికి సీట్ల కేటాయింపులో 'సర్వేనే ప్రామాణికం' అని నాయకత్వం ప్రకటించినప్పటికీ, ఆ సర్వే నిజంగా ఎంతవరకు అమలైంది అన్న ప్రశ్నలు కార్యకర్తలు, ఆశావహులలో బలంగా వినిపిస్తున్నాయి. సర్వేలో ముందున్నామని భావించిన పలువురు గెలుపు అవకాశాలున్న అభ్యర్థులు పక్కకు పోయారని, అదే సమయంలో పార్టీ పెద్దలు సూచించిన వారికి, ఫిరాయింపు దారులకి, లాభియింగ్ చేసుకున్న వాళ్లకి మాత్రమే సీట్లు దక్కాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సర్వే పేరుతో గెలిచే అవకాశాలు తక్కువగా ఉన్న వాళ్ళకి సీట్లు కేటాయించారని పార్టీ శ్రేణులు బహిరంగంగానే చర్చించుకుంటున్నాయి. దీంతో సర్వే అనేది నిజంగా ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబించిందా? లేక ముందే రాసుకున్న స్క్రీన్‌ప్లే ప్రకారమే సీట్లు పంచారన్న భావన బలపడుతోంది. ఇదిలా ఉండగా ఈ సారి డివిజన్ల రిజర్వేషన్ల మార్పుతో కొందరు పాత సిట్టింగ్ అభ్యర్థులు పోటీ చేయలేని పరిస్థితి ఏర్పడింది. తమ డివిజన్‌లో రిజర్వేషన్ మారిపోవడంతో బరిలో నిలవలేకపోయిన ఈ నేతలు, రాజకీయంగా వెనక్కి నెట్టబడకుండా ఉండేందుకు ఇతర మార్గాలు అన్వేషించుకుంటూ.. కొందరు తమకు అనుకూలమైన పదవులు దక్కించుకునే దిశగా ప్రయత్నాలు చేస్తుండగా, మరికొందరు ఆశావహులకు సీట్లు ఇప్పిస్తామని నమ్మిస్తూ తమ స్వంత ప్రయోజనాలు చూసుకుంటున్నారన్న విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. దీంతో పార్టీ కోసం ఏళ్లుగా పనిచేసిన తాము చివరి నిమిషంలో పక్కకు పోయామని పలువురు ఆశావహులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిజంగా పార్టి అధిష్టానం సర్వే ఉంటే దాని ఫలితాలు ఎక్కడ? ఎవరి ఆధారంగా ఈ నిర్ణయాలు తీసుకున్నారు? అన్న ప్రశ్నలు కార్యకర్తల మధ్య విస్తృతంగా వినిపిస్తున్నాయి. ఈ పరిస్థితి వల్ల పార్టీ లోపల అసంతృప్తి పెరుగుతోందని, దాని ప్రభావం ఎన్నికల ఓట్ల సమయంలో బయటపడే అవకాశముందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. మొత్తంగా చూస్తే, సర్వే పేరుతో జరిగిన సీట్ల కేటాయింపు పార్టీకి లాభం చేసిందా? లేక కష్టపడి పనిచేసిన నాయకులు, కార్యకర్తలను నిరుత్సాహపరిచిందా? అన్న ప్రశ్నకు ఇప్పటివరకు స్పష్టమైన సమాధానం కనిపించడం లేదు. అయితే ఈ అసంతృప్తి ఎన్నికల ఫలితాలపై తప్పకుండ పడుతుందని, అధికార పార్టీ నష్టపోయే అవకాశాముదని పలువురు ఆ పార్టీ కార్యకర్తలే చర్చించుకుంటున్నారు.




**మరో రకమైన స్క్రీన్‌ప్లే..**

కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సీట్ల కేటాయింపుల వెనుక సాగిన స్వార్థ రాజకీయాలపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. కొన్ని డివిజన్లలో రిజర్వేషన్లు మారడంతో అక్కడి పాత నాయకులకు సీట్లు దక్కకపోవడంతో, ఆ పరిస్థితిని అవకాశంగా మలుచుకున్న కొందరు నేతలు ఆశావహులను 'బాగిగా' వాడుకున్నట్లు సమాచారం. ఒక డివిజన్‌లో ఎస్సీ వర్గానికి సీటు రావడంతో, కాంగ్రెస్‌కు ఏళ్లుగా అనుబంధంగా ఉన్న ఓ వ్యక్తికి టికెట్ ఇప్పిస్తానని అదే ప్రాంతానికి చెందిన ఓ మైనారిటీ నేత నమ్మబలికినట్టు తెలుస్తోంది. చివరకు అతన్ని అడ్డుపెట్టుకుని తనకు కో-ఆప్షన్ మెంబర్ పదవి కావాలని డిమాండ్ చేసినట్టు సమాచారం. ఆ డిమాండ్‌కు మంత్రి స్థాయి హామీ తీసుకున్నారని పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. అదేవిధంగా అదే డివిజన్‌లో గతంలో కౌన్సిలర్‌గా పనిచేసిన మరో నేతకు కూడా రిజర్వేషన్ కారణంగా సీటు దక్కలేదు. దీంతో నేరుగా పోటీలో నిలవలేని పరిస్థితిలో, తన తరఫున మరో అభ్యర్థిని బరిలో ఉంచుతానని ముందుకు వచ్చినట్టు సమాచారం. అయితే ఆ సీటు వేరే అభ్యర్థికి కేటాయించడంతో.. ఈ నేత వెనక్కి తగ్గకుండా, 'కొండ' స్థాయిలో కోరికలు కారకుండా కొంత లబ్ధి పొందేలా వినూత్న మార్గాలు అన్వేషించినట్టు తెలుస్తోంది. బరిలో ఉంచుతానన్న అభ్యర్థి సింగరేణి ఉద్యోగి కావడంతో, అతనికి బదిలీ ఇప్పిస్తామని చెప్పి మంత్రిని కలిపి హామీ తెచ్చుకున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఈ ప్రక్రియలో ఆ ఉద్యోగి వద్ద నుంచి ముందే కొంత మొత్తాన్ని 'సెటిల్' చేసుకున్నారన్న చర్చ కూడా బహిరంగంగానే సాగుతోంది. అయితే ఈ ఇరువురు నేతలు ఇంతటితో ఆగకుండా.. పార్టీ జాబితా ఖరారైన తర్వాత కూడా ఇక్కడి ఓ ఆశావహుడిని 'ఇంకా అవకాశం ఉంది' అంటూ ఖమ్మం తీసుకెళ్లి, వాహనాలు, ఇతర ఖర్చుల పేరుతో సుమారు రూ.40 వేల వరకు ఖర్చు చేయించి, మంత్రి ని కలిసి తమ స్వంత పనులు చక్కదిద్దుకున్నారని సమాచారం. ఈ నేతలు చేసిన ఘనకార్యం బయటికి రావడంతో కాంగ్రెస్ పార్టీని నమ్ముకున్న ఆశావహులను ఈ విధంగా మోసం చేస్తున్నారని, కొందరు నేతలు రాజకీయాన్ని వ్యక్తిగత లాభాల సాధనగా మార్చుకున్నారన్న ఆగ్రహం పార్టీ శ్రేణుల్లో వెల్లువెత్తుతోంది. దీంతో పార్టీని నమ్ముకుని ఏళ్లుగా పనిచేసిన వారికి ఆటోమేటిక్‌గా సీట్లు దక్కకపోగా, కొందరు నేతలు మాత్రం తమ స్వార్థ ప్రయోజనాల కోసం ఆశావహులను వాడుకుంటూ ముందుకు సాగుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సర్వే పేరుతో, స్క్రీన్‌ప్లే రాజకీయాలతో నిర్ణయాలు తీసుకుంటూ, నిజంగా పార్టీ కోసం కష్టపడిన వారిని పక్కన పెట్టడం పట్ల కార్యకర్తలు, ఆశావహుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. ఇది కేవలం సీట్ల కేటాయింపుల సమస్య మాత్రమే కాదని, పార్టీపై నమ్మకాన్ని దెబ్బతీసే పరిణామమని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ 'స్క్రీన్‌ప్లే రాజకీయాలు' ఇలాగే కొనసాగితే, దాని ప్రభావం ఎన్నికల ఫలితాలపైనే కాకుండా, పార్టీ భవిష్యత్తుపై కూడా తప్పక పడుతుందన్న హెచ్చరికలు పార్టీలోనే వినిపిస్తున్నాయి.

# మిగిలింది వీళ్లే..

**కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్**

**60 డివిజన్లు 354 మంది అభ్యర్థులు**

కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 60 డివిజన్లకు గాను మొత్తం 354 మంది అభ్యర్థులు తుది బరిలో నిలిచారు.

పార్టీల వారీగా అభ్యర్థులు:

కాంగ్రెస్ 58

బీఆర్ఎస్ 58

సీపీఐ 57

బీజేపీ 53

జనసేన 14

ఆల్ ఇండియా బ్యాక్‌వర్డ్ ఫార్వర్డ్ పార్టీ 10

బీఎస్పీ 6

సీపీఎం 2

ఇతర గుర్తింపు పార్టీలు 5

స్వతంత్రులు 91

కార్పొరేషన్ పరిధిలో స్వతంత్ర అభ్యర్థుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో, అనేక డివిజన్లలో త్రిముఖ, చతుర్ముఖ పోటీలు నెలకొనే అవకాశం కనిపిస్తోంది.

**అశ్వారావుపేటమున్సిపాలిటీ**

**22 వార్డులు 78 మంది అభ్యర్థులు**

అశ్వారావుపేట నూతన మున్సిపాలిటీలో 22 వార్డులకు గాను మొత్తం 78 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు.

పార్టీల వారీగా అభ్యర్థులు:

బీఆర్ఎస్ 22

కాంగ్రెస్ 21

బీజేపీ 15

అలయన్స్ డెమోక్రటిక్ పార్టీ 10

స్వతంత్రులు 4

రాష్ట్రీయ లోక్ దళ్ 3

సీపీఐ 1

జనసేన 1

సీపీఎం 1

కాంగ్రెస్ పార్టీ నుంచి మొదట 12 మంది రెబల్ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా, పార్టీ పెద్దల బుజ్జగింపుల అనంతరం 11 మంది నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. ఒక అభ్యర్థి మాత్రం స్వతంత్రంగా బరిలో కొనసాగుతున్నారు.

**ఇల్లందు మున్సిపాలిటీ**

**24 వార్డులు 108 మంది అభ్యర్థులు**

ఇల్లందు మున్సిపాలిటీలో 24 వార్డులకు గాను మొత్తం 108 మంది అభ్యర్థులు తుది పోటీలో ఉన్నారు.

పార్టీల వారీగా అభ్యర్థులు:

కాంగ్రెస్ 24

బీఆర్ఎస్ 20

బీజేపీ 17

జనసేన 7

సీపీఐ 2

సీపీఎం 1

బీఎస్పీ 1

స్వతంత్రులు 36

గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు తమ అభ్యర్థులకు బీ - ఫామ్‌లు జారీ చేయగా, ఆయా అభ్యర్థులు వాటిని ఎన్నికల అధికారులకు సమర్పించారు. ఇల్లందులో స్వతంత్ర అభ్యర్థుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో, పలువురు వార్డుల్లో పోటీ ఉత్కంఠగా మారనుంది.

**ఇక ప్రచారమే కీలకం**

నామినేషన్ల ఉపసంహరణ పూర్తవడంతో మూడు పట్టణాల్లో ఎన్నికల ప్రచారం అధికారికంగా ప్రారంభమైంది. ఫిబ్రవరి 9 సాయంత్రం 5 గంటల వరకు ప్రచారానికి అవకాశం ఉండగా, ఫిబ్రవరి 11 న పోలింగ్, 13 న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. నామినేషన్లు, ఉపసంహరణ దశలు పూర్తవడంతో కొత్తగూడెం కార్పొరేషన్‌తో పాటు అశ్వారావుపేట, ఇల్లందు మున్సిపాలిటీల్లో ఎవరు పోటీలో ఉన్నారన్నది స్పష్టమైంది. ఇక నుంచి అసలు రాజకీయ పోరు ప్రచారంలోనే సాగనుంది. చివరకు ఓటరు తీర్పే ఎవరి రాజకీయ భవిష్యత్తును నిర్ణయించనుంది.

# ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలి

**సిపిఎం మండల కార్యదర్శి మచ్చ రామారావు**

**చర్ల, ఫిబ్రవరి 03:(ప్రజా జ్యోతి):** చర్ల మండలంలో మంగళవారం పూసుకుప్ప గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు చేస్తున్న ప్రదేశాన్నీ సిపిఎం పార్టీ మండల కార్యదర్శి మచ్చ రామారావు సందర్శించారు .ఈ సందర్భగా వారు మాట్లాడుతూ 2004లో సిపిఎం పార్టీ ఎంపీల మద్దతుతో అటవీ హక్కుల చట్టం అదేవిధంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం (100 రోజుల పని) నిరుపేద అణగారిన వర్గాల ప్రజలకు వంద రోజుల పని చట్టాన్ని ఆనాడు తీసుకురావడం జరిగింది అని 2004 నుండి 2025 వరకు నిరుపేద ప్రజలు అట్టడుగు వర్గాల ప్రజలకు అణగారిన ప్రజలకు ఆసరాగా ఉండి వాళ్ల జీవనోపాధికి ఉపయోగపడింది అని ప్రస్తుతం కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వికసిత్ భారత్ రాంజీ అనే పథకాన్ని తీసుకురావడం జరిగింది అని అంటే ఈ దేశానికి స్వాతంత్రం తెచ్చినటువంటి మహాత్ముడి పేరును ,మహాత్మా గాంధీ పేరును తొలగించే కుట్ర చేసి (వి బి జి రామ్ ) పథకాన్ని తీసుకురావడం జరిగింది అని కానీ ఈ పథకంలో ఎటువంటి గ్యారంటీలు లేవు అని అన్నారు .ఆనాడు కేంద్రం 90 శాతం నిధులు రాష్ట్రాలకు ఇస్తే 10% రాష్ట్ర ప్రభుత్వాలు భరించి పనిని కల్పించేవి అని మహాత్మా గాంధీ పేరుతో ఉన్నటువంటి ఉపాధి హామీ చట్టాన్ని తొలగించి



విబిజి రాంజీ చట్టాన్ని పెట్టడం వలన 60 శాతం కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించి 40% రాష్ట్ర ప్రభుత్వాలను ఇవ్వాలని ప్రకటించింది అని దీనివలన గ్రామాల నుంచి పేదలు పట్టణాలకు వలసలు పోయే పరిస్థితి ఉంది అని కార్పొరేట్ పెట్టుబడిదారులకు కారు చౌకగా కార్మికులు దొరకాలంటే గ్రామాల్లో పనిదొరక్కుండా చేసే కుట్ర ఇది అని తక్షణమే విబిజి రాంజీ చట్టాన్ని తొలగించి యధావిధిగా మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి పథకాన్ని కొనసాగించాలని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి మచ్చ రామారావు డిమాండ్ చేశారు. లేనియెడల దశల వారి పోరాటాలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చిన్నబి పోతయ్య తదితర గ్రామ ప్రజలు అందరూ పాల్గొన్నారు.

# హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలం



**-ఇల్లందు మునిసిపాలిటీని అభివృద్ధి చేసిన ఘనత టీఆర్ఎస్ ప్రభుత్వానిదే**

**ఇల్లందు, ఫిబ్రవరి 3, ప్రజాజ్యోతి:** గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక వాటిని నెరవేర్చడంలో పూర్తిగా విఫలం చెందిందని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మున్సిపల్ ఎన్నికల కోఆర్డినేటర్ ఆర్జెసి కృష్ణ, మాజీ ఎమ్మెల్యే భానోత్ హరిప్రియ నాయక్ లు ఆరోపించారు. మంగళవారం స్థానిక బిఆర్ఎస్ నియోజకవర్గ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఇల్లందులో ఐక్యతాటముగా ఏర్పడడం సంతోషకరమన్నారు. గత మున్సిపాలిటీ పాలకవర్గంలో ఇల్లందును అన్ని రంగాలుగా అభివృద్ధి చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. మున్సిపల్ పరిధిలోని 24 వార్డులలో బిఆర్ఎస్ 20 వార్డులు, సిపిఐ 2, సీపీఎం 1, ప్రజాపంథా మాస్ లైన్ 1 స్థానాల్లో పోటీ చేయడం జరుగుతుందని తెలిపారు. అదేవిదంగా బీసీలకు 16, ఎస్సీలకు 5, ఎస్టిలకు 2, జనరల్ 1 స్థానాలను కేటాయించినట్లు పేర్కొన్నారు. బీసీల పక్షపాతి టీఆర్ఎస్ పార్టీ అని, ఇల్లందు మున్సిపాలిటీలో బీసీలకు 67 శాతం టికెట్లను కేటాయించినట్లు తెలిపారు. గత ప్రచారంలో మరలా టీఆర్ఎస్ పార్టీకే అవకాశం ఇస్తామని ప్రజలు చెప్పడం జరిగిందన్నారు. ఇల్లందు మున్సిపాలిటీలో 20కి పైగా స్థానాలను గెలుచుకునేందుకు నిరంతర కృషి చేయడం జరుగుతుందని, ఇల్లందు మున్సిపాలిటీపై ఐక్య కూటమి జెండా ఎగురవేస్తామన్నారు. అమలుకు సాధ్యం కానీ హామీలతో కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. రెండేళ్ల కాంగ్రెస్ పార్టీలో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. ముఖ్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ కు పాల్పడుతుందని ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ను ఫోన్ ట్యాపింగ్ కేసు పేరుతో ఇబ్బందులు గురిచేయడం ఏమిటని ప్రశ్నించారు. గ్రామపంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు సరైన గుణపాఠం చెప్పారని, మున్సిపల్ ఎన్నికల్లో సైతం అదే పునరావృతం అవుతుందన్నారు. రైతులకు యూరియా ఇవ్వలేని ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమేనని విమర్శించారు. బొగ్గు స్కామ్ ను బయట పెట్టినందుకే కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు, సంతోష్ లను సిట్ విచారణ చేయడమే నిదర్శనమన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా కెసిఆర్ అగ్ర బాగాన నిలిపారని గుర్తు చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో ఐక్య కూటమి అభ్యర్థులను ప్రజలు ఆదరించి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహమ్మద్ జబ్బార్, పరుచూరి వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు సిలివేరు సత్యనారాయణ, ఎస్ రంగనాథ్, ఐక్య కూటమి నాయకులు సారయ్య, బాస శ్రీనివాస్, దేవరకొండ శంకర్, ఎస్‌పి నబి, పాయం వెంకన్న, యాకుబ్ షావలి, లక్కినేని సురేందర్, భూక్యా దళ్ సింగ్ నాయక్, జెకె శ్రీనివాస్, శీలం రమేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# బీసీలకు అధిక ప్రాధాన్యతనిస్తున్న పార్టీ కాంగ్రెస్

**-ప్రజలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించండి**

**ఇల్లందు, ఫిబ్రవరి 3, ప్రజాజ్యోతి:** బీసీలకు కాంగ్రెస్ పార్టీ అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే కోరం కనకయ్య స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇల్లందు మున్సిపాలిటీలో బీసీలకు 14, ఎస్సీలకు 7, ఎస్టీలకు 2, ఓసిలకు 1 కౌన్సిలర్ సీటు ఇవ్వడం జరిగిందన్నారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను దృష్టిలో ఉంచుకొని కౌన్సిలర్ అభ్యర్థులను ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోవడం లేదని, 24 వార్డులలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులే పోటీలో ఉంటున్నారన్నారు. గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేయడం జరుగుతుందని గుర్తు చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాటలు తప్ప చేతుల్లో చేసింది ఏమీ లేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులను గెలిపించే బాధ్యత ప్రజలపై ఉందని, మున్సిపాలిటీలోని ప్రతి వార్డుల అభివృద్ధి బాధ్యత తనదేనని పేర్కొన్నారు. ఓట్ల కోసం వచ్చే వారికీ ప్రజలే బుద్ధి చెప్పాలని కోరారు. మున్సిపల్ చైర్మన్ ను పార్టీ నిర్ణయిస్తుందని తెలిపారు. యువతకు ఎక్కువ కౌన్సిలర్ స్థానాల్లో అవకాశం ఇవ్వడం జరిగిందన్నారు. ఇల్లందు మున్సిపాలిటీపై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, మాజీ మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వర్‌రావు, పట్టణ అధ్యక్షుడు దొడ్డ డానియల్, మాజీ పట్టణ అధ్యక్షుడు జానీ, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కోరం సురేందర్, నాయకులు స్వరూప, ఈసం లక్ష్మణ్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులు ప్రారంభించిన సర్పంచ్

**టేకులపల్లి,ఫిబ్రవరి03, ప్రజాజ్యోతి:** మండలంలోని 9వ మైల్ తండ పంచాయతీలో గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులను గ్రామ సర్పంచ్ బానోత్ పూర్ణ మంగళవారం ప్రారంభించారు.ఈ ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం పనులకు గ్రామంలో ఉన్న ఎక్కువమంది పనులకు హాజరుకావాలని కోరడం జరిగింది. ప్రతిరోజు పనిని రోజుకి రూ 307/- రూపాయలు తగ్గకుండా పనిచేయాలని కోరడం జరిగింది. పని ప్రదేశంలో పనిచేస్తున్న వేతనదారులు ప్రతిరోజు రెండు ఫోటోలు తప్పనిసరిగా ఆన్లైన్ ద్వారా నమోదు చేసుకోవాలని కోరడం జరిగింది. పని ప్రదేశానికి కూలీలు భోజనాలు వెంట తీసుకుని వచ్చి ఎక్కువ పనిని పూర్తి చేయాలని కోరడం జరిగింది. పని ప్రదేశానికి పనిముట్లు తీసుకురావాలని చెప్పడం జరిగినది.ఈ కార్యక్రమంలో ఏపీవో కాళంగి శ్రీనివాస్,సెక్రెటరీ రాజు,టీఏ సురేష్,మేట్ యుగేందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.





# వైభవంగా శివ కళ్యాణం

**చర్ల, ఫిబ్రవరి 03:(ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలోని తేగడలో సోమవారం రాత్రి మాఘ మాస కృష్ణ పక్ష పాద్యమి సందర్భంగా తేగడ భద్రకాళీ సహిత వీరేశ్వర స్వామి వారి కళ్యాణం (శివ కళ్యాణం. )అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమం నిత్య కళ్యాణం లో భాగంగా ఆలయ నిర్వాహకులు. శ్రీమాన్. యల్లమందల. శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు భాను ప్రకాష్ వైదిక కళ్యాణ



క్రియ చేశారు. ఈ కళ్యాణం పూజ చేసుకోవడం కోసం తూర్పుగోదావరి జిల్లా. గొల్లల మామిడాడ లోపలికి పైన రాజు పాలెం వారు శ్రీమాన్. వీర వెంకట సత్యనారాయణ నాగ మణి దంపతులు , హైదాబాద్ నుండి కోకా శ్రీకాంత్ నాగ ప్రసన్న దంపతులు, చర్ల నుండి ఐన ఓలు శేఖర్ నాగేశ్వరీ దంపతులు, చర్ల నుండి కొందరు ప్రముఖులు గుమ్మడి రవీంద్ర దంపతులు పాల్గొన్నారు. అందరికీ దేవాలయం తరుపున అన్న ప్రసాదం ఏర్పాటు చేయడం జరిగింది. కళ్యాణం చేయించుకున్న యజమాన దంపతులు గతంలో వెండి శె టా రీ దాతలు ప్రధాన గంట దాతలు శాశ్వత గోత్ర నామములో కూడా మొదటి పేరు. ఆ కారణం గా వారికి ఆలయ మర్యాదలు వీరేశ్వర స్వామి వారి శేష వస్త్రం స్వామి ఫోటో ఆలయం తరుపున బహుకరణ చేసి ఆశీస్సులు అందచేయండం జరిగింది.

# సేంద్రియ, గ్రామీణ ఉపాధి యూనిట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్

**పశుసంవర్ధక శాఖ అడిషనల్ డైరెక్టర్ అమయ్ కుమార్**

**పాల్వంచ ,ఫిబ్రవరి 3,ప్రజా జ్యోతి:** జిల్లాలో అమలవుతున్న సేంద్రియ వ్యవసాయం, కౌజు పిట్టల పెంపకం, కొర్రమీను చేపల సాగు వంటి వినూత్న వ్యవసాయ , గ్రామీణ ఉపాధి కార్యక్రమాలను జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, పశు సంవర్ధక శాఖ అడిషనల్ డైరెక్టర్ అమయ్ కుమార్ మంగళవారం పరిశీలించారు. ఈ పర్యటనలో భాగంగా పాల్వంచ మండలం కొత్తూరు గ్రామంలో ఏర్పాటు చేసిన చరిత సేంద్రియ కౌజు పిట్టల పెంపకం యూనిట్‌ను వారు సమగ్రంగా పరిశీలించారు. యూనిట్‌లో అమలవుతున్న సేంద్రియ విధానాలు, కౌజు పిట్టల పెంపకం విధానాలు, పరిశుభ్రత ప్రమాణాలు, ఉత్పత్తి, ప్యాకేజింగ్, మార్కెటింగ్ విధానాలను సమీక్షించి తగిన సూచనలు ఇచ్చారు. యూనిట్‌లో సేంద్రియ పద్ధతిలో తయారుచేసే ఉత్పత్తుల్లో మునగాకు ఆధారిత ఉత్పత్తులు, చిరుధాన్యాలతో తయారుచేసిన ఆహార పదార్థాలు, ఇప్ప లడ్డు, ఇప్ప నూనె, లెమన్ టీ, వివిధ రకాల కారం పొడులు, పచ్చళ్ళు, హెర్బల్ సబ్బులు మొదలైన మొత్తం 102 రకాల ఉత్పత్తులు ఉన్నాయి. గ్రామీణ వనరులను సమర్థవంతంగా ఉపయోగిస్తూ, సోలార్ సిస్టమ్ ద్వారా ఉత్పత్తులను ఎండబెట్టి, రసాయన రహిత విధానంలో ప్రజలకు అందించడం ఈ యూనిట్ ప్రత్యేకత. పరిశుభ్రత, ఆకర్షణీయమైన ప్యాకేజింగ్, సమర్థవంతమైన మార్కెటింగ్ విధానాల వల్ల కౌజు పిట్టల గుడ్లు, మాంసం స్థానిక మార్కెట్‌లో మంచి ఆదరణ పొందుతున్నాయని పక్షులకు అందించే ఆహార దాణా, గాలి ప్రసరణ, షెడ్ నిర్వహణ, పరిశుభ్రత చర్యలను కూడా పరిశీలించారు అనంతరం, దమ్మపేట మండలం నాగుపల్లి గ్రామంలో మహిళా సంఘ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కౌజు పిట్టల పెంపకం యూనిట్‌ను కూడా పరిశీలించారు. గుడ్ల ఉత్పత్తి, గుడ్లను పొదిగించడం, పిల్లల పెంపకం వంటి ప్రక్రియలను యూనిట్ నిర్వాహకులు వివరించారు. జిల్లా కలెక్టర్, రాబోయే రోజుల్లో ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, యంత్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి నాబార్డ్ ద్వారా ఆర్థిక సహాయం పొందేలా సూచించారు. అనంతరం లింగాలపల్లి గ్రామంలో గిరిజన యువ రైతు చాపా బాలకృష్ణ ఉడయ్ ఆక్వా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొర్రమీను చేపల పెంపకం



యూనిట్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. బాలకృష్ణ, రసాయన ఎరువులు లేదా క్రిమి సంహారక మందులు వినియోగించకుండా, ఘన జీవామృతం, ద్రవ జీవామృతం వంటి సహజ పద్ధతుల ద్వారా మంచి దిగుబడి సాధిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ గుర్తించారు. అలాగే, సమీకృత ప్రకృతి వ్యవసాయం చేపట్టే విధంగా స్థానిక ఏ.పి.యం కు సూచనలు చేశారు. జిల్లాలో అమలవుతున్న ఈ సేంద్రియ వ్యవసాయం, పశుపక్షి పెంపకం, మత్స్య సాగు కార్యక్రమాలు రైతులు, మహిళా సంఘ సభ్యులు, గ్రామీణ యువతకు స్థిర ఆదాయ మార్గాలను కల్పిస్తున్నాయి అని జిల్లా కలెక్టర్ అన్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు ఆర్థికాభివృద్ధిని సాధించే ఈ విధానాలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రవీంద్ర రెడ్డి, గ్రామ సమాఖ్య సభ్యులు, స్థానిక సర్పంచులు, మహిళలు, రైతులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# ఆశ వర్కర్లు స్వచ్ఛంద సేవకులు కాదు రెగ్యులర్ కార్మికులుగా గుర్తించాలి

**రూ.26 వేల వేతనం, రెగ్యులర్ హోదా ఇవ్వాలి: సీఐటీయూ డిమాండ్**

**దమ్మపేట,ఫిబ్రవరి.03,(ప్రజాజ్యోతి):** ఆశ వర్కర్లపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి కొనసాగిస్తోందని, వెంటనే వారికి నెలకు రూ. 26 వేల స్థిర కనీస వేతనం నిర్ణయించి రెగ్యులర్ కార్మికులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్వారి గూడెం దమ్మపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శారద, సునీత అధ్యక్షతన నిర్వహించిన ఆశ వర్కర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 45వ, 46వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ సిఫార్సులను అమలు చేయకుండా కేంద్రం కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని విమర్శించారు. స్కీం కార్మికుల కోసం ప్రత్యేక పే కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత కేంద్ర బడ్జెట్‌లో ఆరోగ్య రంగానికి కేటాయింపులు తగ్గించడంతో పాటు ఆశ వర్కర్ల వేతనాలు పెంచకపోవడం దారుణమని పేర్కొన్నారు. ఆశ వర్కర్లను శాశ్వత ఆరోగ్య కార్యక్రమం పథకంగా గుర్తించి, దేశవ్యాప్తంగా ఒకే విధమైన పని పరిస్థితులు అమల్లోకి తేవాలని స్పష్టం చేశారు. ఆశ వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 12న జరగనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ మురహరి రఘు, ఆశ వర్కర్లు శ్రీలత, రాధా, రజిని, నాగమణి, భాగ్యమ్మ, సరోజినీ తదితరులు పాల్గొన్నారు.

# జేఏసీ సదస్సును జయప్రదం చేయండి -

**కార్మిక సంఘాల జేఏసీ పిలుపు**

**టేకులపల్లి,ఫిబ్రవరి03, ప్రజాజ్యోతి:** కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడలు రద్దు చేయాలని నూతన వ్యవసాయ చట్టాలను నూతన విద్యుత్ బిల్లును ఉపసాగించుకోవాలని తదితర డిమాండ్లతో ఫిబ్రవరి 12న జరుగు దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ ఫిబ్రవరి. 6న టేకులపల్లి జేఏసీ ఆధ్వర్యంలో జరుగు సదస్సును జయప్రదం చేయాలని జేఏసీ నాయకులు డి ప్రసాద్,కడుదుల వీరన్న, జరుపుల సుందర్,గుగులోత్ రామచందర్ పిలుపునిచ్చారు. మంగళవారం టేకులపల్లి లో జరిగిన జేఏసీ సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక వర్గం అనేక త్యాగాలతో సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దుచేసి పారిశ్రామికవేత్తలకు బడా పెట్టుబడిదారులకు లబ్ధి చేకూర్చే విధంగా నాలుగు లేబర్ కోడులను తీసుకొచ్చి దేశ కార్మిక వర్గాన్ని కట్టు బానిసలుగా మార్చే కోడులను ఉపసంహరించుకొనే వరకు కార్మిక వర్గం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ పిలుపులో భాగంగా ఈ 6న జరుగు సదస్సుకు సింగరేణి గ్రామపంచాయతీ హమాలీ మిషన్ భగీరథ ఆశ అంగన్వాడి మధ్యాహ్న భోజన కార్మికులు ఇంకా తదితర సంఘటిత అ సంఘటిత కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బోడ మంచ, జినక ప్రసాద్,అయిత శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



# ఇంటర్మీడియట్ ప్రయోగ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

**జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరరావు**

**పాల్వంచ :కొత్తగూడెం కలెక్టరేట్: ఫిబ్రవరి 3: ప్రజా జ్యోతి :** జిల్లాలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ వార్షిక ప్రయోగ పరీక్షలను నిబంధనల ప్రకారం నిర్వహించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇంటర్మీడియట్ ప్రయోగ పరీక్షలు సజావుగా కొనసాగుతున్న నేపథ్యంలో మంగళవారం ఆయన ములకలపల్లి, అశ్వరావుపేట మండలాల్లోని పలు జూనియర్ కళాశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ములకలపల్లి మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి ప్రయోగ పరీక్షల నిర్వహణ విధానం, ప్రయోగశాలల ఏర్పాట్లు, విద్యార్థుల హాజరు నమోదు, ప్రశ్నపత్రాల భద్రత తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించారు. అనంతరం అశ్వరావుపేట మండలంలోని ఒక ప్రైవేట్ జూనియర్ కళాశాలను తనిఖీ చేసి పరీక్షలు నిబంధనల ప్రకారం నిర్వహిస్తున్నారా లేదా అన్న విషయాన్ని పరిశీలించారు. రెండవ రోజు నిర్వహించిన ప్రయోగ పరీక్షల హాజరు వివరాలను సమీక్షించిన జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి, మాట్లాడుతూ ఉదయం నిర్వహించిన పరీక్షలలో సాధారణ విభాగానికి కేటాయించిన 1,295 మందిలో 1,263 మంది హాజరుకాగా 32 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. వృత్తి విద్య విభాగానికి కేటాయించిన 1,386 మందిలో 1,207 మంది హాజరుకాగా 179 మంది గైర్హాజరయ్యారని , మొత్తం ఉదయం జరిగిన పరీక్షలకు 2,681 మందికి గాను 2,470 మంది హాజరై 211 మంది



గైర్హాజరయ్యారని వెల్లడించారు. అలాగే మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షలలో సాధారణ విభాగానికి కేటాయించిన 880 మందిలో 861 మంది హాజరుకాగా 19 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. వృత్తి విద్య విభాగానికి కేటాయించిన 1,365 మందిలో 1,308 మంది హాజరుకాగా 58 మంది గైర్హాజరయ్యారని చెప్పారు. మొత్తం మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు 2,245 మందికి గాను 2,169 మంది హాజరై 77 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. ప్రయోగ పరీక్షలు పూర్తయ్యే వరకు అన్ని పరీక్ష కేంద్రాల్లో నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. పరీక్షల నిర్వహణలో పారదర్శకత, క్రమశిక్షణ తప్పనిసరిగా పాటించాలని కళాశాల యాజమాన్యాలను ఆయన ఆదేశించారు.

# ఈ అభ్యర్థి.. ఏ పార్టీ?

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 3, ప్రజాజ్యోతి :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కార్పొరేషన్, మున్సిపాలిటీ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్, పరిశీలన, ఉపసంహరణ ప్రక్రియలు పూర్తయ్యాయి. అధికారికంగా చూస్తే ఎవరు బరిలో ఉన్నారు, ఎవరి నామినేషన్ చెల్లింది అన్నది ఎన్నికల అధికారులకు, ఆయా పార్టీలకు కొంతమేర స్పష్టమైంది. కానీ ప్రజల స్థాయిలో మాత్రం పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంది. ఇప్పటికీ జిల్లాలో ప్రధాన ప్రశ్న ఒక్కటే.. ఈ అభ్యర్థి.. అసలు ఏ పార్టీ..?. ఎవరు ఏ డివిజన్, వార్డు నుంచి పోటీ చేస్తున్నారు అన్నది కంటే, ఏ పార్టీ తరఫున పోటీ చేస్తున్నారు అన్నదే అర్థం కాని పరిస్థితి నెలకొంది. కొందరు అభ్యర్థులు కాంగ్రెస్ తరఫున బరిలో ఉన్నామంటున్నారు. మరికొందరు సీపీఐ పేరుతో నామినేషన్ వేశారు. ఇంకొందరు స్వతంత్రులుగా కనిపిస్తున్నారు. కానీ పొత్తుల ప్రచారం నేపథ్యంలో జరిగిన తికమకలో వీరంతా చివరకు ఏ పార్టీ గుర్తుపై బరిలో నిలిచారూ, ఎ పార్టి బి – ఫారమ్ దక్కింది అన్నది ప్రజలకు ఇంకా స్పష్టంగా తెలియడం లేదు.

నామినేషన్ సమయంలో సాధారణంగా బి – ఫారమ్ ఆధారంగానే పార్టీ అభ్యర్థి ఖరారవుతాడన్న విషయం తెలిసిందే. కానీ జిల్లాలో పొత్తులపై చివరివరకు స్పష్టత లేకపోవడంతో, బిఫారమ్ ఎవరికీ ఏ పార్టీ నుంచి వచ్చింది..? చివరకు ఏ పార్టీ తరఫున పోటీ చేస్తున్నాడు..? అన్న అంశాలపై కూడా ఓటర్లకు, ఆయ పార్టీ కార్యకర్తలకు ఇంకా గందరగోళం కొనసాగుతోంది. అధికారులకు ఫైళ్లలో స్పష్టత ఉన్నా, ఆ సమాచారం ప్రజల్లోకి చేరడం లేదు. ఫలితంగా ఓటర్లలో అయోమయం పెరుగుతోంది.

## అధికార పార్టీకి అనుకూలంగా బీఆర్ఎస్ టికెట్లు?

**ఇల్లందు, ఫిబ్రవరి 03, ప్రజాజ్యోతి :** ఇల్లందు మున్సిపాలిటీ ఎన్నికల్లో ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ టికెట్ కేటాయింపులపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. అధికార కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉండే విధంగా బీఆర్ఎస్ అభ్యర్థుల ఎంపిక జరిగిందన్న ఆరోపణలు రాజకీయ వర్గాల్లో చర్చకు వచ్చాయి. ముఖ్యంగా పలు వార్డుల్లో సిట్టింగ్ కౌన్సిలర్లను పక్కనపెట్టి కొత్తవారికి టికెట్లు ఇవ్వడం పార్టీ శ్రేణుల్లో అసంతృప్తిని పెంచుతోంది. కొన్ని వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు గట్టి పోటీ ఇచ్చే స్థాయి ఉన్న బీఆర్ఎస్ నాయకులను పక్కన పెట్టారని, బలహీన అభ్యర్థులకు అవకాశం ఇచ్చారని పార్టీ లోపలే అసంతృప్తి వ్యక్తమవుతోంది. బీఆర్ఎస్ నాయకత్వం ఈ మార్పులను సర్వేల ఆధారంగా చేశామని చెబుతున్నప్పటికీ, ఆ సర్వేల్లో స్పష్టత లేదన్న అభిప్రాయం కార్యకర్తల్లో ఉంది. ఇక్కడ సిట్టింగ్ స్థానాలను మార్చడం, అనూహ్యంగా అభ్యర్థులను మారుస్తుండటం వెనుక రాజకీయ లెక్కలు ఉన్నాయన్న చర్చ నడుస్తోంది. ఇదిలా ఉండగా, ఇల్లందు మున్సిపాలిటీలో అధికార కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికల్లో ఎలాంటి పొత్తులు లేకుండా ఒంటరిగా బరిలో దిగుతోంది. మరోవైపు బీఆర్ఎస్ మాత్రం సీపీఐ, సీపీఎం, ప్రజాపంథా మాస్‌లైన్ పార్టీలతో కలిసి ఐక్య కూటమిగా ఎన్నికల పోరుకు సిద్ధమవుతోంది. అయితే కూటమిలో ఉన్నప్పటికీ బీఆర్ఎస్ తరఫున సరైన అభ్యర్థుల ఎంపిక జరగలేదన్న విమర్శలు ఆ కూటమికే నష్టం కలిగించే అవకాశముందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. టికెట్ కేటాయింపుల్లో జరిగిన తేడాల వల్ల ఇల్లందులో ప్రతిపక్ష బీఆర్ఎస్ బలం తగ్గిపోయే ప్రమాదం ఉందని, ఇది నేరుగా అధికార కాంగ్రెస్ పార్టీకి లాభంగా మారే అవకాశం ఉందన్న అభిప్రాయం బలంగా వినిపిస్తోంది. పార్టీ లోపలి అసంతృప్తులు, కార్యకర్తల గుసగుసలు ఇప్పటికే ప్రచారంపై ప్రభావం చూపుతున్నాయని సమాచారం. మొత్తానికి, ఇల్లందు మున్సిపాలిటీలో బీఆర్ఎస్ టికెట్ కేటాయింపులు అధికార కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా మారాయా? లేక ఇది పార్టీ అంతర్గత గందరగోళమేనా? అన్న ప్రశ్నలు ఎన్నికల ఫలితాల వరకు కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# ప్రజల పక్షాన నిలిచే వారిని ఎన్నుకోవాలి

**ఇల్లందు, ఫిబ్రవరి 3, ప్రజాజ్యోతి:** ప్రజా సమస్యలపై అవగాహన ఉండి, వారి పక్షాన నిలిచే వారికే మున్సిపల్ ప్రజలు ఓట్లు వేసి గెలిపించుకోవాలని బిసి జేఏసీ రాష్ట్ర కన్వీనర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మడత వెంకట్ గౌడ్ కోరారు. మంగళవారం స్థానిక ఏక్తా హౌస్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 24 వార్డులలో ఆరు వార్డులు రిజర్వేషన్లు మినహాయించి మిగిలిన 18 వార్డులలో బహుజనులు విజయం సాధించాలని కోరారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కోసం బీసీ జేఏసీ నిరంతరం కృషి చేస్తుందని, అందులో భాగంగా ఢిల్లీ వరకు వెళ్లి ఉద్యమాలు చేయడం జరిగిందని, పళ్ళు రాజకీయ పార్టీల నేతలను కలిసి తమకు మద్దతు తెలపాలని కోరినట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా 42 శాతం రిజర్వేషన్ అమలు కాకుండా ఎన్నికలు నిర్వహించవద్దని బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ డిమాండ్ చేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలను వాయిదా వేసి మున్సిపల్ ఎన్నికలను సమ్మక్క సారలమ్మల జాతర ఉన్న సమయంలో సమయం ఇవ్వకుండా నిర్వహించడం ఏమిటని ప్రశ్నించారు. తమ బీసీ సంఘం ఆధ్వర్యంలో 24 వార్డులలో పాదయాత్రలు చేసిన సమయంలో ప్రజల నుండి అనుహ స్పందన వచ్చిందని, జనరల్ స్థానాల్లో బీసీ, ఎస్టీ, ఎస్టీ అభ్యర్థులకు మద్దతు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. బీసీలు ప్రశ్నించే నాయకత్వాన్ని అలవర్చుకోవాలని కోరారు. ఇల్లందు మున్సిపల్ చైర్ పర్సన్ గా మడత రమా హయంలో రూ. 120 కోట్ల నిధులను తీసుకురావడం జరిగిందని గుర్తు చేశారు. ఎనిమిదో వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా మాజీ మున్సిపల్ చైర్పర్సన్ మడత రమ నామినేషన్ వేసి, ఉపసంహరించుకున్నట్లు తెలిపారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు ముందస్తుగా చైర్మన్ అభ్యర్థిని ప్రకటించకుండా ఎన్నికలకు వెళ్లడం జరుగుతుందని, అర్హతలు లేనివారు పదవులను ఆశిస్తున్నారని విమర్శించారు. ప్రజలు ఆలోచించి ఎవరిని కౌన్సిలర్గా గెలిపించాలో వారికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. బహుజనుల పక్షాన బీసీ జేఏసీ చేసి ఉంటుందన్నారు. ఈ సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ మడత రమా, ఏక్తా హౌస్ సభ్యులు పాల్గొన్నారు.

# ఐటీడీఏ పథకాలను వినియోగించుకోండి

**ఉప్పరగూడెం సర్పంచ్ సోడియం నాగలక్ష్మి**

**చర్ల, ఫిబ్రవరి 03:(ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో మంగళవారం ఉప్పరిగూడెం గ్రామపంచాయతి సర్పంచ్ సోయం. నాగలక్ష్మి ఐ టి డీ ఏ నుండి వచ్చే రకరకాల పండ్ల మొక్కలు తోటల గురించి రైతులను కలిసి అవగాహన కల్పించడం జరిగింది.ఐ టి డీ ఏ నుండి వచ్చే పథకాలను వినియోగించు కోవాలని గ్రమస్తులకు వివరించారు.రైతులు ముందుకొచ్చి పండ్ల తోటలకు అనువైన పంట భూములను సర్పంచ్ కు చూపించటం జరిగింది. రైతు లకు సర్పంచ్ ఈవిందంగా అవగాహన కల్పిస్తున్నందుకు ఆనందాన్ని వ్యక్తం చేసారు ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు .

## నూతన పేసా కమిటీలు ఏర్పాటు చెయ్యాలి

**చర్ల, ఫిబ్రవరి 03:(ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో మంగళవారం నూతన పేసా కమిటీలు ఏర్పాటు చెయ్యాలి అని ఆదివాసీహక్కులపరిరక్షణవేదిక తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ ఇరప. రాజు దొర డిమాండ్ చేస్తున్నట్లు ప్రత్రిక ప్రకటన ద్వారా తెలియజేశారు.చర్ల మండలం 26 గ్రామ పంచాయతీల్లో నూతన పాలకవర్గంతో పేసా కమిటీలు ఏర్పాటు చెయ్యాలి అని ఏజెన్సీ ప్రాంతం అభివృద్ధి కోసం పేసా గ్రామసభలు నిర్వహించి ఆదివాసులు ఆమోదం ద్వారా పంచాయతీల్లో అభివృద్ధి కోసం, ఇసుక రిచ్ ల అనుమతి కోసం ఆదివాసుల పార్లమెంట్ చట్టం పేసా తీర్మానం లు చెప్పట్టాలి అని మండలం అభివృద్ధి అధికారి( ఎంపీడీఓ ), భద్రాద్రికొత్తగూడెం జిల్లా కలెక్టర్, భద్రాచలం ఐటీడిఏ పిఓ అధికారులు ద్వారా పేసా గ్రామసభలు ఏర్పాటు చెయ్యాలని అన్నారు.

# మున్సిపల్ బరిలో 108 మంది

**ఇల్లందు టౌన్, ఫిబ్రవరి 3, ప్రజాజ్యోతి:** మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా మంగళవారం నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ పూర్తి కాగా 24 వార్డులకు గాను 108 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. బిజెపి 17, బీఎస్పీ ఒకటి, సిపిఎం ఒకటి, కాంగ్రెస్ 24, బిఆర్ఎస్ 20, సిపిఐ 2, జనసేన పార్టీ 7, ఇండిపెండెంట్ 36 మంది అభ్యర్థులు ఎన్నికల పోటీలో ఉన్నారు. ఆయా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు కౌన్సిలర్ అభ్యర్థులకు బి ఫామ్ లను ఇవ్వగా వారు ఎన్నికల అధికారులకు వాటిని సమర్పించారు.